సాక్షి విశాఖపట్నం

శుక్రవారం : 13 : జనవరి : 2023

దారులన్నీ.. ఊరివైపే..



రైల్వేస్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

- సంక్రాంతి పండగ సందర్భంగా పల్లె బాట పట్టిన నగరం
- కిటకిటలాడుతున్న రైల్వే స్టేషన్, బస్టాండ్
- రైళ్లు ఫుల్... స్లీపర్ క్లాస్‌లోనూ రద్దీ
- మార్కెట్లకు పెద్ద పండుగ కళ



అదిగో రైలు పదండి..



రైలు దిగి బయటకు వస్తున్న ప్రయాణికులు



ద్వారకా బస్‌స్టేషన్‌లో..

సాక్షి, విశాఖపట్నం: నగరం పల్లెబాట పడుతోంది. వెచ్చగా భోగి మంటలేసుకొని చలి కాచుకుంటున్న పల్లెల్లో ఇళ్లన్నీ సింగారించుకుంటున్నాయి. సంక్రాంతి సెలవులు రావడంతో పండగ చేసుకునేందుకు ప్రజలు సొంతూళ్లకు పయనమవుతున్నారు. సరికొత్త కాంతులతో సంక్రాంతి పండగని పల్లెల్లో చేసుకునేందుకు బయలుదేరిన ప్రయాణికులతో బస్టాండ్లు రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. మరో వైపు సంక్రాంతి షాపింగ్‌తో ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటలు దాటుతున్నా.. షాపింగ్ మాల్స్ సందడి వాతావరణంలోనే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం 14 నుంచి మూడు రోజులు సెలవులు ఇవ్వడంతో ప్రభుత్వ కార్యాలయాలు అప్పుడే ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

'ప్రత్యేక' సర్వీసులు ఫుల్

సంక్రాంతి రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండే విధంగా ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. విశాఖ రీజియన్ నుంచి రెగ్యులర్‌గా తిరిగే వాటితో పాటు 2022 సంక్రాంతి సమయంలో 492 స్పెషల్ బస్సులు వేయగా.. ఈ ఏడాది 550 బస్సులు వేశారు. విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, కాకినాడ, భీమవరం, మొదలగు దూరప్రాంత బస్సులతో పాటు విజయనగరం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, సోంపేట, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వీటితో పాటు ఇరుగు పొరుగు ప్రాంతాలైన నరసన్నపేట, టెక్కలి, పలాస తదితర ప్రాంతాలకు బస్సులు వేశారు. ఇదే మాదిరిగా ఈస్ట్ కోస్ట్ రైల్వే కూడా ప్రధాన ప్రాంతాలకు ప్రత్యేకరైళ్లు నడుపుతోంది. అయినా పండగ రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ ప్రాంతాలకు 5 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఓవైపు ప్రయాణికులు పెద్ద ఎత్తున ఉండటంతో రైళ్లు, బస్సులు ఖాళీ ఉండటం లేదు. ముఖ్యంగా రైళ్లలోని జనరల్ బోగీల్లో అడుగు కూడా వెయ్యలేని పరిస్థితి ఉండటంతో.. ఫైన్లు కట్టి మరీ రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణాలు చేస్తున్నారంటే డిమాండ్ ఎంతలా ఉందో అర్థమవుతోంది. స్లీపర్ క్లాస్‌లు కూడా కాలు పెట్టలేనంతగా ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.

మార్కెట్లకు సంక్రాంతి శోభ

సంక్రాంతి పండగంతా మార్కెట్‌లోనే కనిపిస్తోంది. ఎటు చూసినా జనంతో నగరం కిటకిటలాడుతోంది. విద్యా సంస్థలకు, కార్యాలయాలకు సెలవు ప్రకటించడంతో మార్కెట్‌లో షాపింగ్ జోరందుకుంది. మార్కెట్ కూడళ్లు తిరునాళ్లని తలపిస్తున్నాయి. వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల షోరూమ్‌లు.. ఇలా ప్రతి షాపూ కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. జగదాంబ, ద్వారకానగర్, ఆశీల్‌మెట్ట, సిరిపురం, వీఐపీ రోడ్డు, మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం, గాజువాక తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులు ఇసకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోతున్నాయి. పోలీస్ బ్యారెక్స్ వద్ద గల వస్త్రాల దుకాణాల వద్ద కొనుగోలుదారులు ఎగబడ్డారు.



పోలీసు బ్యారెక్స్ పక్కన దుస్తుల దుకాణాల వద్ద కొనుగోలుదారులు

న్యూస్‌రీల్

త్వరలో ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్



ఆర్‌టీవో కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్

గోపాలపట్నం: గంభీరం వద్ద ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ త్వరలో అందుబాటులోకి రానున్నదని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. కెమెరాలు, సెన్సార్లు ఇప్పటికే అమర్చినట్టు పేర్కొన్నారు.మరో రెండు నెలల్లో ట్రాక్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ఆర్‌టీవో కార్యాలయంలో రోడ్ల మరమ్మతులకు రూ.68 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. మరో 15 రోజుల్లో అనుమతులు రానున్నాయని పేర్కొన్నారు.

తారు రోడ్లపై భోగి మంటలు వేయకండి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): సంక్రాంతి సందర్భంగా ఇళ్లను శుభ్రం చేసిన వ్యర్థాలను రోడ్లపై విచ్చల విడిగా వేయరాదని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇళ్లల్లో పాత సామగ్రి, వ్యర్థాలను రోడ్లపై వేయకుండా ఇంటికి వచ్చే క్లాప్ వాహనానికి అందించి నగర పరిశుభ్రతకు తోడ్పాటు అందించాలన్నారు. ఇంట్లో పాడైన తలగడలు, పరుపులు, పాత వస్తువులను క్లాప్ వాహనానికి అందించాలన్నారు. భోగి మంటలు తారు రోడ్లపై వేయరాదని, తారు కాలిపోయి రోడ్లు గుంతలు పడతాయన్నారు అలాగే టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు భోగి మంటల్లో వేయరాదని, వీటి వల్ల కాలుష్యం పెరిగిపోతుందని, అందుకు సహజ సిద్ధమైన పిడకలు, కర్రలు వంటివి ఉపయోగించాలని సూచించారు. వేగంగా మండే పెట్రోల్, డీజిల్ కూడా ఉపయోగించకూడదన్నారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం

విశాఖ,లీగల్ : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.ఇందిరా ప్రియదర్శిని నాలుగు రోజుల పర్యటన నిమిత్తం గురువారం విశాఖ చేరుకున్నారు. విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఆమెకు ఘన స్వాగతం పలికారు. జస్టిస్ ప్రియదర్శిని విశాఖకు చెందిన వారు. విశాఖలో సీనియర్ న్యాయవాది పి.ఉమాబాల వద్ద జూనియర్‌గా పనిచేశారు. అనంతరం జిల్లా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ ప్రియదర్శినిని పలువురు న్యాయవాదులు, న్యాయమూర్తులు శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యాయసహాయకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ లీగల్: జిల్లాలోని ప్రజలందరికీ ఉచిత న్యాయ సహాయం అందించడానికి ఔత్సాహికులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విశాఖ న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ చదివిన వారు అర్హులు. వివిధ సేవా సంస్థల్లో పనిచేసిన వారికి పాధాన్యం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.ఎంపిక చేసిన వారికి న్యాయవిజ్ఞానంపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ పొందిన వారికి ఎటువంటి పారితోషకం ఉండదు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోపు కార్యదర్శి, విశాఖ జిల్లా న్యాయసేవాప్రాధికార సంస్థ(లోక్ అదాలత్) జిల్లాకోర్టు ఆవరణ విశాఖపట్నం-2 అనే చిరునామాకు పంపించాలని తెలిపారు.

ఏయూలో ఉద్యోగ నియామకాల పేరుతో అసత్య ప్రచారం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 33 బోధనేతర ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని, దరఖాస్తు చేసుకోవాలంటూ అసత్య ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. రికార్డ్ అసిస్టెంట్, టైపిస్ట్ తదితర బోధనేతర ఉద్యోగాలు ఏయూలో భర్తీ చేస్తున్నట్టు ఈ ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ ప్రకటనలు ఏయూ అధికారుల దృష్టికి రావడంతో వారు అప్రమత్తమయ్యారు. ఏయూ రిక్రూట్‌మెంట్ 2023 పేరుతో వెబ్‌సైట్‌లో ప్రకటనలు దర్శనమివ్వడంతో ఏయూ అధికారులు వెంటనే స్పందించారు. ఏయూలో ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయలేదని రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఏయూలో ఎటువంటి నియామకాలు జరిగినా విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.andhrauniversity.edu.inలో ఉద్యోగ ప్రకటన వివరాలు ఉంచుతామని చెప్పారు.

సుమోటో కేసులతోనే బాలలకు సత్వర న్యాయం

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డి.వి.రమణ



న్యాయమూర్తి డి.వి.రమణతో గొండు సీతారాం

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): సుమోటో కేసుల స్వీకరణతోనే బాలలకు సత్వర న్యాయం సాధ్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ తెలిపారు. నగర పర్యటనలో ఉన్న ఆయనతో సిరిపురం ప్రభుత్వ అతిథిగృహంలో గురువారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం భేటీ అయ్యారు. బాలల హక్కుల కమిషన్ ద్వారా ఇంతవరకు ఎన్ని కేసులు సుమోటోగా స్వీకరించారు, ఏయే చర్యలు తీసుకున్నారు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం న్యాయమూర్తి వెంకట రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో దురదృష్టకర సంఘటనలు, పరిణామాలు చోటుచేసుకున్నట్టు ప్రసారమాధ్యమాల్లో వచ్చే వార్తలు,అందిన ఫిర్యాదులకు నూరు శాతం వాస్తవ ఆధారాలున్నట్టు భావిస్తే సుమోటోగా స్వీకరించాలని తెలిపారు. లోక్‌సభ,రాజ్యసభల ఆమోదంతో ఏర్పడిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చట్టబద్ధంగా ఎంతో శక్తివంతమైందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో బాలల సమస్యలపై అంశాలను ఆదేశాలు,సూచనలు, సలహాల రూపంలో సంబంధిత శాఖలకు చేరవేయాలన్నారు. బాలలకు పూర్తి న్యాయం జరిగేలా బాధ్యతగా చర్యలు చేపడితే పిల్లలు,వారి తల్లిదండ్రుల మోముల్లో చిరునవ్వులు చూడవచ్చని తెలిపారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ న్యాయమూర్తి సూచించిన ప్రతీ అంశాన్ని కమిషన్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి అమలు పరిచే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ భేటీలో బాలల సంఘ నాయకుడు బొడ్డేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఎఫ్ఏసీ సూపరింటెండెంట్‌గా అశోక్‌కుమార్



మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేజీహెచ్ ఎఫ్ఏసీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా పని చేసిన పి.మైథిలీ డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. గత నెల 31న గుంటూరు మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి గుంటూరులో పనిచేస్తున్న అశోక్‌కుమార్‌ను కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా గురువారం అశోక్‌కుమార్‌ను ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జి) సూపరింటెంటెంట్‌గా నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.ఎస్.నవీన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

16 ప్రైవేట్ బస్సులపై కేసులు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): సంక్రాంతి పండగను పురస్కరించుకుని పెరుగుతున్న రద్దీని ఆసరాగా తీసుకుని అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. రవాణా శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించగా.. వివిధ నిబంధనల ఉల్లంఘనల కారణంగా 16 బస్సులపై కేసులు నమోదు చేశారు. మొత్తంగా ఇప్పటి వరకు 87 బస్సులపై కేసులు నమోదయ్యాయి. మూడు బస్సులను సీజ్ చేశారు. ఈ నెల 17 వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయని ఆర్‌టీఏ అధికారులు తెలిపారు.

టెన్త్ నామినల్ రోల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ

విశాఖ విద్య: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నామినల్ రోల్స్ నమోదులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల వివరాలు పరిశీలనకు బోర్డు ఉన్నతాధికారులు మరో అవకాశం కల్పించారన్నారు. దీనిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థి పేరు, తల్లి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ వంటి ఎంట్రీలు పక్కాగా చేసి, వీటిని మరోమారు పరిశీలన చేసి ధృవీకరించుకోవాలన్నారు. ఈ నెల 20లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా ఏయూ

- వీసీ ప్రసాదరెడ్డి
- ఏయూను సందర్శించిన విదేశీ ప్రతినిధులు



పాలక మండలి సభ్యుడు యేసుపాదంను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయంగా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దుతున్నట్టు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి తెలిపారు. అమెరికా, స్విర్జర్లాండ్, జర్మనీ దేశాల ప్రతినిధులతో ఏయూ సెనేట్ మందిరంలో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో ఏయూతో కలసి పనిచేయాలని ఆహ్వానించారు. ఇటీవల కాలంలో ఏయూలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులకు విద్యను అందించే కేంద్రంగా ఏయూ నిలుస్తోందని తెలిపారు. విజ్ఞానానికి కేంద్రంగా, ఆవిష్కరణలకు నిలయంగా ఏయూను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధిని ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆహ్వానించారు. ఏయూను స్వయంగా సందర్శించి విదేశాలలో ప్రచారం చేయాలని వీసీ సూచించారు. అనంతరం వీరు ఏయూలోని అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహాలను సందర్శించి విద్యార్థులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఏయూ పాలక మండలి సభ్యుడు పి.ఏసుపాదం మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికా, యూరప్ ఖండాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేసే దిశగా ప్రయత్నిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్ ఆచార్య శ్రీనివాస్, చీఫ్ వార్డెన్‌సీహెచ్ ఆశా ఇమ్మాన్యుయెల్ రాజు, డాక్టర్ రాజమాణిక్యం, డాక్టర్ కె.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డిని సత్కరించారు. ఏయూ తరపున పాలక మండలి సభ్యులు యేసుపాదంను సత్కరించారు.

దస్తావేజులు, స్టాంప్ విక్రేతలపై విజిలెన్స్ దాడులు

సాక్షి, విశాఖపట్నం: దస్తావేజులు, స్టాంప్ పేపర్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత దాడులు జరిపారు. గోపాలపట్నం, అనకాపల్లి, చోడవరం తదితర ప్రాంతాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి నేతృత్వంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, దస్తావేజుల విక్రయ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా దస్తావేజుల విడుదల, విక్రయాలను బేరీజు వేశారు. అనకాపల్లి జిల్లాలో పరవాడ, మునగపాక, చోడవరం, సబ్బవరం మండలాలు, విశాఖ జిల్లాలో గోపాలపట్నం, మహారాణిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో విక్రయాలలో అక్రమాలు చోటు చేసుకున్నాయని గుర్తించారు. అధిక ధరలను వసూలు చేస్తున్నట్టు నిర్ధారణ కావడంతో 11మంది విక్రేతలపై కేసులు నమోదు చేశారు. దాడులలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కోటేశ్వరరావు, లక్ష్మోజీ, తిరుపతి రావు, రేవతి, రాము తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు బాసటగా..

- రైల్వేస్టేషన్లలో జీసీసీ స్టాళ్లు
- తొలి విడత ఐదు స్టేషన్లలో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే విజయవాడ, రాజమండ్రిలో స్టాళ్లు
- త్వరలో విశాఖపట్నం, గోపాలపట్నం, దువ్వాడ స్టేషన్లలో..
- పసుపు నుంచి కాఫీ వరకూ అన్ని ఉత్పత్తుల విక్రయం



రైల్వేస్టేషన్‌లో జీసీసీ స్టాల్

సాక్షి, విశాఖపట్నం : కొండల్లో లభించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తుల్ని సేకరిస్తూ.. వాటిని విక్రయిస్తున్న గిరిజనులకు ఆర్థిక భరోసా కల్పించే బాధ్యతని భుజస్కందాలపై వేసుకున్న జీసీసీ.. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఆలోచనలతో అడుగులు వేస్తోంది. గిరిపుత్రులు సేకరించే వాటిని గిరిజన సహకార సంస్థ ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తోంది. ఇవి అరుదుగా దొరికే రకాలు, స్వచ్ఛమైన ఉత్పత్తులు కావడంతో మార్కెట్‌లో వీటికి మంచి గిరాకీ ఉంది. ముఖ్యంగా తేనె, చింతపండు, త్రిఫల చూర్ణం, నన్నారి, అలోవిరా, జాస్మిన్, నీమ్ ఇంటర్నేషనల్ సబ్బులు, ఉసిరి, శీకాకాయ, కుంకుడు కాయలు, వీటిద్వారా తయారుచేసిన షాంపులు, రాజ్మా చిక్కుళ్లతో పాటు వందకు పైగా విభిన్న రకాల ఉత్పత్తులు సేకరిస్తున్నారు. ఇవన్నీ ఎలాంటి కల్తీ లేకుండా లభించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులు. వీటిని ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేసి 'జీసీసీ' పేరుతో బ్రాండింగ్ చేస్తున్నారు. ఇంకొన్ని ఉత్పత్తుల ద్వారా సబ్బులు, షాంపులతో పాటు అరకు కాఫీ, వైశాఖీ కాఫీపొడి తయారుచేస్తున్నారు. వీటి కోసం హైదరాబాద్, తిరుపతి, రాజమహేంద్రవరం, విజయవాడ, విశాఖపట్నంలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేశారు. ఇక్కడ నుంచి నేరుగా మార్కెట్లకు విక్రయిస్తున్నారు. వీటి బ్రాండింగ్‌తో పాటు మార్కెటింగ్ విశాఖపట్నంలోని జీసీసీ ఆధ్వర్యంలో జరుగుతోంది. బ్రాండింగ్, వాటి ధర, ఉత్పత్తికి సంబంధించిన పూర్తి వివరాలు ప్యాకెట్‌పై ముద్రిస్తున్నారు. కల్తీ లేని స్వచ్ఛమైన ఉత్పత్తులు కావడంతో మన రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా వీటికి ఎక్కువ డిమాండ్ ఉంది.

మరింత ఊతమిచ్చేలా..

ప్రస్తుతం ఉన్న విక్రయాలకు మరింత ఊతమందించేందుకు రైల్వేస్టేషన్లలోనూ ఈ ఉత్పత్తులతో కూడిన స్టాళ్లను ఏర్పాటు చేయాలని జీసీసీ భావించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రైల్వే శాఖతో జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ సంప్రదింపులు జరిపారు. ఇప్పటికే రెండు స్టేషన్లలో వన్ స్టేషన్.. వన్ ప్రొడక్ట్ కార్యక్రమంలో భాగంగా జీసీసీ స్టాల్స్ ఏర్పాటుకు రైల్వే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో రెండు రోజుల క్రితమే.. విజయవాడ, రాజమండ్రి రైల్వే స్టేషన్లలో జీసీసీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లలో గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నారు. త్వరలోనే విశాఖపట్నం, దువ్వాడ, గోపాలపట్నం రైల్వే స్టేషన్లలోనూ జీసీసీ స్టాళ్ల ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నెలాఖరులోగా ఆయా స్టేషన్లలో స్టాల్స్ ఏర్పాటు చేసి.. విక్రయాలు చేపట్టేందుకు జీసీసీ ఎండీ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు.

గిరి ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్



గిరిజన ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుండడంతో గిరిజనులు కూడా ఎక్కువగా అటవీ ఉత్పత్తులు సేకరిస్తున్నారు. అంతేకాక, వారి పొలాల్లో ఇతర పంటలు పండించి వాటిని అందిస్తున్నారు. వీరు సేకరిస్తున్న ఉత్పత్తులను వినియోగదారులకు జీసీసీ అందుబాటులోకి తేవడం ద్వారా కల్తీలేని స్వచ్ఛ ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నాం. మార్కెట్‌లో జీసీసీ బ్రాండ్ ఉత్పత్తులు భారీగా సేల్ అవుతున్నాయి. అందుకే ఉత్పత్తులకు మార్కెట్‌ని మరింత పెంచేందుకు రైల్వే స్టేషన్లలో స్టాళ్ల ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. ఇప్పటికే ఆ దిశగా సఫలీకృతులయ్యాం. దీని ద్వారా గిరిజనుల ఆర్థిక స్థోమత మరింత పెరిగే అవకాశాలున్నాయి.

– సురేష్‌కుమార్, జీసీసీ ఎండీ

ఏఎంసీలో వసతులపై ఎన్ఎంసీ ఆరా

- పీజీ సీట్ల పెంపుతో ఆకస్మిక తనిఖీలు
- కేజీహెచ్‌లో సదుపాయాలు పరిశీలన
- సంతృప్తి వ్యక్తం చేసిన బృందం సభ్యులు



ఎన్ఎంసీ అసెస్‌మెంట్ కమిటీ సభ్యులతో సమావేశమైన ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆంధ్ర వైద్య కళాశాలలో పోస్టు గ్రాడుయేట్ సీట్లు(పీజీ) పెంపు, అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) పునరుద్ధరణ నేపథ్యంలో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) అసెస్‌మెంట్ కమిటీ సభ్యులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఏఎంసీతో పాటు కేజీహెచ్‌లో పలు వార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశారు. జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ)కి చెందిన సీనియర్ ప్రొఫెసర్ పి.సుమలత(ఉస్మానియా, హైదరాబాద్), ఫరూఖీ షా(గుజరాత్), కోటేశ్వరమ్మ(గాంధీ ఆస్పత్రి, హైదరాబాద్), వినీత్ జోసెఫ్(బెంగళూరు) తదితరుల ఆధ్వర్యంలో సుమారు 30 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఏఎంసీలో వసతులు, సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజుతో సమావేశమయ్యారు. ఎటువంటి సమాచారం లేకుండా గురువారం ఈ బృందం విశాఖ చేరుకుంది. 99 సంవత్సరాల చరిత్ర గల ఏఎంసీకి అనుబంధంగా కేజీహెచ్ ఉండడం వల్ల అనుమతులు త్వరగా వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

131 పీజీ సీట్ల పెంపు

ఆంధ్ర వైద్య కళాశాలకు పీజీలో 27 వైద్య విభాగాలకు సంబంధించి 131 సీట్లు పెరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) విద్యార్థులకు సీట్లు కేటాయించడం వల్ల పీజీ సీట్లు పెరిగాయి. ప్రస్తుతం 38 వైద్య విభాగాల్లో 237 సీట్లు ఉన్నాయి. తాజాగా ప్రతిపాదించిన 131 సీట్లు కలిపితే ఆ సంఖ్య 368కు చేరుతుంది. ఇందుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు, వసతి గృహాల నిర్మాణం, కీలక వైద్య పరికరాల కోసం రూ.157 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) సిద్ధం చేశారు. ఈ డీపీఆర్‌ను ఇటీవల ఢిల్లీలో జాతీయ వైద్య మండలి, కేంద్ర ఆరోగ్య శాఖ నిర్వహించిన సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు సమర్పించారు. ఈ మేరకు రూ.157 కోట్ల నిధులు కూడా మంజూరు చేశారు. ఈ నిధులను కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మంజూరు చేస్తాయి.

సమకూరనున్న వసతులు

కొత్తగా సమకూరే భవనాల్లో సమావేశ మందిరాలు, లెక్చరర్ హాళ్లు, ప్రస్తుతం ఉన్న ఆపరేషన్ థియేటర్లలో వసతులు మెరుగుపర్చడం, మరికొన్ని వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేశారు. జాతీయ వైద్య మండలి మార్గదర్శకాలకు లోబడి ఆయా వసతులను కల్పించాల్సి ఉంది. పందిమెట్ట ప్రాంతంలో ఏఎంసీ విద్యార్థి వసతి గృహం, క్రీడా మైదానం ఉన్నాయి. క్రీడా మైదానంలో పీజీలకు వసతి గృహం నిర్మించడానికి ప్రతిపాదనలు రూపొందించారు.

గ్లోబల్ ఫ్యాకల్టీగా డాక్టర్ వెంకటరమణ


డాక్టర్ కె.వెంకటరమణ

మురళీనగర్: ప్రముఖ ఏకేఏస్ సంస్థ ఏటా నిర్వహించే గ్లోబల్ ఫ్యాకల్టీ కాన్‌క్లేవ్ అండ్ అవార్డుకు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణను ఎంపిక చేసింది. ప్రపంచవ్యాప్తంగా అధ్యాపక, పరిశోధన రంగంలో విశేష కృషి చేసిన వారికి ఈ అవార్డులను ప్రకటించారు. ఈ అవార్డులకు 25 దేశాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులను ఎంపిక చేశారు. ఈ మేరకు డాక్టర్ వెంకటరమణను అధ్యాపక విభాగానికి ఎంపిక చేస్తూ ఈ మెయిల్ ద్వారా సమాచారాన్ని పంపించారు. ఈ అవార్డును వర్చువల్ విధానంలో ఈనెల 29న ఆయనకు అందిస్తారు.

పోయిన లక్ష ఇప్పించారు


బాధితురాలు కవితకు లక్ష నగదుతో కూడిన బ్యాగును అందజేస్తున్న డీసీపీ నాగన్న

అల్లిపురం (విశాఖ దక్షిణం): ఆటోలో పోగొట్టుకున్న రూ.లక్షను బాధితురాలికి మూడు గంటల్లోనే డీసీపీ సమక్షంలో అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురానికి చెందిన కవిత అనే మహిళ బుధవారం సాయంత్రం 7.30 గంటల సమయంలో తన షాపింగ్ ముగించుకుని జగదాంబ వద్ద ఆటో ఎక్కి రైల్వేస్టేషన్ వద్ద దిగారు. దిగినప్పుడు ఆటోలో తన హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయారు. అందులో లక్ష రూపాయలున్నాయి. వెంటనే ఆమె పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం ఎస్‌ఐ పైడంనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపి, మూడు గంటలలోనే ఆటోను గుర్తించారు. ఆటో గల బ్యాగులో రూ.లక్ష భద్రంగా ఉండడంతో క్రైం డీసీపీ నాగన్న దానిని బాధితురాలు కవితకు సూర్యాబాగ్ పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడి మోజులో..

- భర్తను హత్యమార్చిన భార్య
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి..
- పోలీసుల దర్యాప్తులో బయటపడిన బాగోతం
- అదుపులో ముగ్గురు నిందితులు?

తగరపువలస: వివాహేతర సంబంధానికి అడ్డంగా ఉన్నాడన్న కారణంతో ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది ఓ భార్య. మృతదేహాన్ని దహనం చేసి, వేరే మహిళతో వెళ్లిపోయాడని బంధువులను నమ్మించేందుకు యత్నించింది. పోలీసులు రంగంలోకి దిగడంతో అసలు విషయం బయటపడింది. హతుడు పైడిరాజు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వలందపేటకు చెందిన గురప్ప, పోలమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. భర్త చనిపోయిన తరువాత పోలమ్మ తగరపువలస మార్కెట్‌లో దుంపలు అమ్మి పిల్లల్ని పోషించింది. వలందపేటలో జీ+2 ఇల్లు ఉంది. మూడో కుమారుడైన పైడిరాజు, జ్యోతి దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉంటున్నారు. పైడిరాజు (34) టైల్స్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జ్యోతి ఎనిమిదో తరగతి వరకు చదివింది. జ్యోతికి విశాఖ అప్పుఘర్ ప్రాంతానికి చెందిన నూకరాజు అలియాస్ శ్రీనివాసరావుతో వివాహేతర సంబంధం ఉంది. గత డిసెంబరు 29వ తేదీ రాత్రి పైడిరాజు ఇంట్లో హత్యకు గురయ్యాడు. ఈ హత్యను జ్యోతి, నూకరాజు చేసినట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. నూకరాజు కజిన్ భూలోక వీరికి సహకరించినట్టు సమాచారం. దీనిపై భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.


భార్యాభర్తలు జ్యోతి, పైడిరాజు

ఆహారంలో మత్తు పదార్థాలు కలిపి..

ఎంవీపీ కాలనీలో గల సీబీఐ కార్యాలయంలో తనకు ఉద్యోగం లభించిందని జ్యోతి కుటుంబ సభ్యులను నమ్మించింది. అక్కడే అద్దె ఇంట్లో ప్రియుడు నూకరాజుతో కలిసి నివాసముంటూ రాకపోకలు సాగించేది. గత నెల 29వ తేదీ రాత్రి ఆహారంలో మత్తు పదార్థాలు కలిపి పైడిరాజుకు పెట్టింది. స్పృహ తప్పిన తరువాత తల వెనుక భాగంపై మారణాయుధంతో కొట్టడంతో చనిపోయాడు. అర్ధరాత్రి వేళ ప్రియుడు, అతని కజిన్ భూలోక సాయంతో మృతదేహాన్ని మూటకట్టి వాహనంలో ఎంవీపీ కాలనీలోని వారు అద్దెకు ఉంటున్న ఇంటికి తరలించారు. 30న పెదజాలారిపేట శ్మశానవాటికలో దహనం చేశారు. అదే రోజు రాత్రి తన భర్త ఇంటి నుంచి అదృశ్యమయ్యాడని జ్యోతి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మెట్లమార్గంలో రక్తపు మరకలు కడుగుతూ..

పైడిరాజు హత్యకు గురైన తరువాత 30వ తేదీ వేకువజామున 4 గంటలకు జ్యోతి మెట్ల మార్గంలో రక్తపు మరకలు కడిగినట్టు బంధువులు తెలిపారు. అంతకు ముందు ఇద్దరు వ్యక్తులు వారి ఇంటి నుంచి మూట పట్టుకుని వెళ్లడం కూడా చూశామంటున్నారు. జ్యోతి మాత్రం పైడిరాజు మరో మహిళతో వెళ్లిపోయాడని ఇంట్లోవారిని నమ్మించే ప్రయత్నం చేసింది. అందులో భాగంగా దివ్య అనే మహిళతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేయించి పైడిరాజు కోసం చూడవద్దని చెప్పించింది. 8వ తరగతి చదువుకున్న జ్యోతికి సీబీఐ కార్యాలయంలో ఉద్యోగం లభించడంపై అనుమానం కలిగిన కుటుంబ సభ్యులు సీబీఐ కార్యాలయంలో సంప్రదించారు. జ్యోతి తమ వద్ద ఉద్యోగం చేయలేదని వారు తెలిపారు. దీంతో జ్యోతిపై బంధువులు భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పైడిరాజు అదృశ్యం వెనుక జ్యోతి పాత్రపై పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. బుధవారం జ్యోతిని, నూకరాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు వారికి సహకరించిన భూలోకను కూడా భీమిలి స్టేషన్‌కు తరలించారని సమాచారం.


నిందితుడు నూకరాజు

వలందపేట గ్రామస్తుల ఆగ్రహం

జ్యోతి, నూకరాజు పోలీసుల అదుపులో ఉన్న విషయాన్ని తెలుసుకున్న హతుడు పైడిరాజు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున గురువారం ఉదయం భీమిలి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పైడిరాజు హత్యకు కారణమైన వీరిని కఠినంగా శిక్షించాలని ఆందోళన చేశారు. దీంతో పోలీసులు నిందితులను తీసుకొని పైడిరాజు మృతదేహాన్ని దహనం చేసిన ప్రదేశంతో పాటు ఎంవీపీ కాలనీలో వీరు ఉంటున్న అద్దె ఇంటిని పరిశీలించారు.

సౌకర్యవంతమైన సేవలకు రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్లు

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ

మధురవాడ (భీమిలి): కక్షిదారులకు మరింత సత్వర, సౌకర్యవంతమైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడానికే రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ విశాఖ డీఐజీ జి.బాలకృష్ణ చెప్పారు. గురువారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో కక్షిదారులు వేచి ఉండడానికి ఫ్లోరా బిల్డర్స్, ఎమ్‌కే కనస్ట్రక్షన్స్, చిలుకూరి హౌసింగ్ ప్రాజెక్ట్స్ సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాన్ని ఆయన జిల్లా రిజిస్ట్రార్ ఎమ్ఎస్‌జీకే మూర్తి తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ ఏర్పాటు చేసి సౌకర్యాలు చూసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో మధురవాడలోనే ఇలాంటిది ఏర్పాటు చేశామని, ఇతర చోట్ల కూడా ఈ తరహాలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. మరింత నాణ్యమైన, సత్వర సేవలు కోసం నెట్వర్కింగ్, అప్లికేషన్స్ అప్‌డేట్ చేశామన్నారు. గంటలు తరబడి కక్షిదారులు వేచి ఉండకుండా ఇప్పటికే టోకెన్ సిస్టమ్ అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. వెయిటింగ్ హాలు ఏర్పాటు ద్వారా మరింత సౌకర్యవంతంగా వేచి ఉండడానికి వీలు అవుతుందని చెప్పారు. సత్వర సేవలు కోసం నిత్యం అన్ని రకాలు సేవలు చేపడుతున్నామని చెప్పారు.


మధురవాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో కక్షిదారుల విశ్రాంతి భవనంలో డీఐజీ బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ ఎమ్ఎస్‌జీకే మూర్తి ఇతర అధికారులు

ఐటీ సెజ్ పనుల్లో పురోగతి

ఐటీ సెజ్‌లో ఏర్పాటు చేస్తున్న రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్ పనులు చురుగ్గా సాగుతున్నాయని, దాని ద్వారా మరింత వేగంగా సేవలు అందుతాయని చెప్పారు. దీనిని కూడా త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఎమ్ఎస్‌జీకే మూర్తి, ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, ఆడిట్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాసరావు, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ ఎమ్.మోహన్‌రావు, కార్పొరేటర్ కంపా హనోక్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతిపై దౌర్జన్యం చేసిన వ్యక్తికి జైలు, జరిమానా

విశాఖ లీగల్: యువతిపై దౌర్జన్యం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5,500 జరిమానా విధిస్తూ నగరంలోని ఒకటవ అదనపు మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పునిచ్చారు. జరిమాన చెల్లించని పక్షంలో అదనంగా 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.వాణి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు భాను ప్రకాష్ విజయనగరం జిల్లా తెర్లాం గ్రామ నివాసి. భాను ప్రకాష్.. ఓ యువతితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెందుర్తి పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కోర్టులో బెయిలు పొందిన తరువాత... 2017 డిసెంబరు 23 తేదీ ఉదయం యువతి కళాశాలకు వెళుతుండగా భానుప్రకాష్ ఆమెను అడ్డగించాడు. లైంగిక దాడి చేస్తానని, కుటుంబ సభ్యులను అంతమొందిస్తానని కత్తితో బెదిరించాడు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన యువతి తన కళాశాలకు సమీపంలోని ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రాంబాబు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ఏయూతో డిజిఫాక్ ఎంవోయూ

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో డిజిఫాక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డిజిఫాక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ పి.అమల్ రాజ్‌లు సంతకాలు చేశారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా డిజిఫాక్ సంస్థ అంకుర సంస్థగా ఏర్పాటైంది. లోకోడ్ టెక్నాలజీ సెంటర్‌గా ఇది ఏయూ, అనుబంధ కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన ఉపయుక్తంగా శిక్షణ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలు వంటివి కల్పిస్తారు. విద్యార్థులకు మేలు చేసే విధంగా ఏయూతో కలసి డిజిఫాక్ సంస్థ పనిచేస్తుంది.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ వేణుగోపాలరావుకు ఐకాయ్ అవార్డు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.వి.వేణుగోపాలరావుకు ప్రతిష్టాత్మక ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐకాయ్) అవార్డు లభించింది. ఐకాయ్ ఆధ్వర్యంలో పరిశ్రమ, వ్యాపార రంగాల్లో అసాధారణమైన స్థాయిలో వృత్తిపరమైన విజయాలు సాధించిన వారికి ఏటా ఈ అవార్డులను అందజేస్తారు. సన్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ ఎండీ దిలీప్ సంఘ్వీ నేతృత్వంలోని జ్యూరీ లార్జ్ కార్పొరేట్, మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కేటగిరిలో వేణుగోపాలరావును ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఐకాయ్ ఆధ్వర్యంలో ఈనెల 10న కోల్‌కతాలో నిర్వహించిన కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సి.వి.ఆనంద బోస్ చేతుల మీదుగా వేణుగోపాలరావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అభినందించారు.

బడి బలోపేతం..!

- నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం
- సబ్జెక్టు టీచర్ల భర్తీకి ప్రాధాన్యం
- అర్హులైన ఎస్జీటీలకు హైస్కూళ్లలో పోస్టింగ్
- ఏ ఒక్క స్కూల్ మూతపడకుండా జాగ్రత్తలు
- యూపీఎస్‌లలో పెరుగనున్న హెచ్ఎం పోస్టులు
- బదిలీల్లో ఇదే రీతిన పోస్టుల కేటాయింపు


కట్టువాని అగ్రహారం పాఠశాలలో నలుగురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

విశాఖ విద్య:

పై ఫొటో అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం కట్టువాని అగ్రహారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనిది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నిర్వహిస్తున్న ఇక్కడ ప్రస్తుతం చదువుతున్నది కేవలం ఐదుగురు విద్యార్థులు (ఒకటి, మూడు, ఐదో తరగతిలో ఒక్కొక్కరు, రెండో తరగతిలో ఇద్దరు ఉన్నారు) మాత్రమే. వీరికి పాఠాలు చెప్పేందుకు ఓ ఉపాధ్యాయుడు అందుబాటులో ఉన్నాడు. జాతీయ విద్యావిధానం అమలుతో ఇలాంటి స్కూళ్లు మూసేస్తారని కొంతమంది దుష్ప్రచారం చేశారు. కానీ ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ముందుకెళ్తోన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ఇలాంటి స్కూళ్లను కొనసాగించేందుకే మొగ్గు చూపింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏ ఒక్క స్కూల్ కూడా మూతపడలేదనడానికి ఇదో నిదర్శనంగా నిలుస్తోంది.

బడుల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు అవసరం/లోటు/మిగులు అనే వాటిని ప్రాధాన్యతగా తీసుకొని కేడర్ వారీగా ఖాళీలను గుర్తించి, జాబితాను సిద్ధం చేశారు. తాజాగా జరిగే బదిలీల్లో ఈ మేరకు ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేశారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో చంద్రకళ

468 మంది సబ్జెక్టు టీచర్ల సర్దుబాటు

విలీన స్కూళ్లలో బోధనకు ఆటంకం లేకుండా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సర్దుబాటు చేశారు. ఇలా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 468 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో (బయాలాజికల్ సైన్సు – 61, గణితం – 95, ఫిజికల్ సైన్సు – 94, సోషల్ – 34, ఇంగ్లిష్ – 184) అర్హత గల సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)లను నియమించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు జాబితా సిద్ధం చేశారు. వీరికి నెలకు రూ.2500లు అదనపు ప్రోత్సాహకాన్ని అందజేస్తారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బదిలీల్లో కూడా ఇదే రీతిన పాఠశాలల్లో పోస్టుల కేటాయింపు చేసిన విద్యాశాఖాధికారులు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3,877 ఖాళీలను చూపించారు. అర్హత గల వారికి భవిష్యత్‌లో ఉద్యోగోన్నతులు దక్కటంతో పాటు, యూపీఎస్‌ల్లో హెచ్ఎం పోస్టులు పెరుగనున్నాయి.

ఆమోదయోగ్యంగా విలీనం

రేషనలైజేషన్‌లో భాగంగా మొదటి దశలో ఒక కిలోమీటర్ దూరంలోపు విశాఖపట్నంలో 2, అనకాపల్లిలో 14, అల్లూరి జిల్లాలో 1 ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను 17 యూపీఎస్‌లలో విలీనం చేశారు. అదే విధంగా విశాఖలో 39, అనకాపల్లిలో 193, అల్లూరిలో 18 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3,4,5 తరగతుల విద్యార్థులను 250 హైస్కూల్స్‌లో విలీనం చేశారు. ఒక్క స్కూలూ మూతపడకుండా విద్యాశాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

త్యాగయ్యకు సంగీత నీరాజనం


కళాకారులతో పంచకృతుల సంగమం

- 200 మంది కళాకారులతో ఘనరాగం పంచరత్న కృతుల ఆలాపన
- వైభవంగా త్యాగరాజ తిరువీధి ఉత్సవం

మద్దిలపాలెం(విశాఖతూర్పు): పలువురు సంగీత విద్వాంసులు శ్రవణానందంగా ఆలపించిన కృతులు సంగీతప్రియులను అలౌకికానందంలో ఓలలాడించాయి. త్యాగరాజ ఆరాధానోత్సవాల్లో భాగంగా గురువారం ఒకే వేదికపై 200 మంది కళాకారులు త్యాగరాజ స్వామి ఘన రాగ పంచరత్న కృతులను వీనుల విందుగా ఆలపించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న త్యాగరాజ ఆరాధానోత్సవాల్లో రెండో రోజు ముందుగా త్యాగరాజ స్వామి తిరువీధి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. త్యాగరాజ ఆరాధాన ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు.. త్యాగరాజస్వామి వేషాధారణలో తిరువీధి ఉత్సవంలో పాల్గొన్నారు. సీతారామలక్ష్మణ స్వాముల విగ్రహాలను పల్లకిలో ఉంచి అప్పన్న నాదస్వరంతో పల్లకి వెనుక 175 మంది కళాకారులు త్యాగరాజ స్వామి కీర్తనలు గానం చేస్తూ అనుసరిస్తుండగా తిరువీధి ఉత్సవం కనుల పండువగా సాగింది.అనంతరం శ్రీరాముల పరివారాన్ని వేదికపై అలంకరించారు. 200 మంది కళాకారులు త్యాగ స్వామి వారి ఘన రాగ పంచరత్నకృతులను ఆలపించారు. మొదటిగా జగదానందకారక అంటూ నాటురాగంలో ఆదితాళంలో గానం చేశారు. సీతారామస్వామికి మంగళ హారతి ఇచ్చి పంచరత్న సేవను ముగించారు.అనంతరం కచేరీలను ప్రారంభించారు. 42 కచేరీల్లో 112 మంది కళాకారులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాటానికి వివేకానంద రచనలు స్ఫూర్తి

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): భారత దేశ స్వాతంత్య్ర పోరాట యోధులకు స్వామి వివేకానంద రచనలే స్ఫూర్తి అని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో గురువారం యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాట యోధులపై బ్రిటిష్ వారు దాడి చేసినప్పుడు వారి వద్ద వివేకానంద రచనలు ఉండేవన్నారు. భారతదేశం గురించి తెలుసుకోవాలంటే వివేకానంద జీవితం చదువుకుంటే చాలని రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారని చెప్పారు. దేశంపట్ల తనకు ఉన్న మమకారం వివేకానంద రచనల వల్ల పెరిగిందని గాంధీ పేర్కొన్నట్టు తెలిపారు. వివేకానంద రోజూ పుస్తకాలు చదివేవారని, ఆయన స్ఫూర్తితో నేటి విద్యార్థులు మంచి పుస్తకాలను చదివి, జ్ఞానం పెంపొందించుకోవాలని చెప్పారు. తన పేరు కాకుండా తన ఆలోచనలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని స్వామి వివేకానంద సూచించినట్టు తెలిపారు. రామకృష్ణ మిషన్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల కోసం స్వామి స్వసంవేద్యానంద్ వివరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీవిద్యార్థులకు బహుమతులు అందజేశారు.


బీచ్‌రోడ్డుకు ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా ర్యాలీ

వివేకానంద జయంతి సందర్భంగా రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వందలాది మంది విద్యార్థులతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జైల్ రోడ్డు నుంచి బీచ్‌రోడ్డు ఈ ర్యాలీ సాగింది.

త్వరలో రాజా విక్రమ్‌దేవ్ విగ్రహం ఏర్పాటు

- మహారాణి రమాకుమారిదేవి పేరిట స్కాలర్‌షిప్‌లు
- హవా మహల్‌లో సంతాప సభలో కుటుంబ సభ్యుల వెల్లడి

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): విశాఖ సాగర తీరంలో మహారాజా రాజావిక్రమ్ దేవ్ విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు రాజమాత మయాంక్ దేవి తెలిపారు. ఒడిశాలోని జయపురం చివరి మహారాణి రమాకుమారిదేవి సంతాప సభను గురువారం బీచ్ రోడ్డులోని హవా మహల్‌లో ఆమె కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాణి పెద్ద కోడలు రాజమాత మయాంక్ దేవి మీడియాతో మాట్లాడుతూ బీచ్ రోడ్డులో రాజా విక్రమ్ దేవ్, రమాకుమారి దేవి విగ్రహాల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి స్థలం కేటాయించాలని కోరామని తెలిపారు. పరిస్థితులు బట్టి తమ కుటుంబంలో ఒకరు మాడుగుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తామన్నారు. రమాకుమారిదేవి బాబాపు సేవా సదన్ పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. 1962లో ఉమ్మడి విశాఖ జిల్లా వి.మాడుగుల నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఆమె ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారని మాయాంక్ దేవి చెప్పారు. రమాకుమారి దేవి పేరిట ఉత్తమ విద్యార్థులకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకుమారి లలిత్ లావంగ్ లతిక, ఆమె భర్త ఎడివి జ్ఞాని వివేక్ కక్రా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజమాత మయాంక్‌దేవి

వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను చోడవరం ఎమ్మెల్యే, అనకాపల్లి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగానే ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూలంగానే ఉందన్నారు. సర్వీసు పరమైన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు వైఎస్సార్ టీఎఫ్ పక్షాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు చొక్కాకుల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్, ముఖ్య సలహాదారు ఎర్ర జగన్నాథరావు, ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు రొంగలి మంగునాయుడు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ధర్మశ్రీ